
తిరుమలలో తరగని రద్దీ



సర్వదర్శనానికి 15 గంటలు

శనివారం అత్యధికంగా 90,211మందికి దర్శనం

వేసవి సెలవులు ముగుస్తుండగటం.. వారాంతం కావడంతో తిరుమలకు శుక్రవారం మొదలైన రద్దీ ఆదివారమూ కొనసాగింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు భక్తులతో నిండుగా కనిపిస్తున్నాయి. కృష్ణతేజ సర్కిల్ మీదుగా రింగురోడ్డులోని శిలాతోరణం సర్కిల్ వరకు దాదాపు కిలోమీటరు మేర క్యూలైన్ ఉంది. వీరికి 15 గంటలు, టైంస్లాట్ టోకెన్లు, టికెట్ల భక్తులకు మూడు గంటల తర్వాత దర్శనం అవుతోంది. శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధులు, అఖిలాండం, లడ్డూకౌంటర్, అన్నప్రసాద భవనం, బస్టాండ్, సీఆర్వో, ఎంబీసీ, పద్మావతి కార్యాలయాలు, లగేజీ కౌంటర్లు, కల్యాణకట్టల్లో భక్తులు కిటకిటలాడుతున్నారు. శ్రీవారిపాదాలు, పాపవినాశనం కూడా రద్దీగా మారాయి. అలిపిరి, శ్రీవారిమెట్టు మార్గాల గుండా భక్తులు తరలివస్తున్నారు.

24 రోజుల్లో 17.81 లక్షల మందికి దర్శనం

వేసవి సెలవుల నేపథ్యంలో మే 1 నుంచి 24వ తేదీ వరకు 17.81 లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో ఈనెల మొదటివారంలో భక్తుల సంఖ్య సాధారణంగానే కనిపించినా.. గత 15 రోజుల్లో భారీగా వచ్చారు. 4, 5, 10, 17, 18, 21వ తేదీల్లో 80 వేలకుపైగా శ్రీవారిని దర్శించుకోగా, శనివారం ఆ సంఖ్య 90,211 కి చేరింది. గత 24 రోజుల్లో శ్రీవారి హుండీ ఆదాయం రూ.80.82 కోట్లు లభించగా, 7.61 లక్షల మంది తలనీలాలు సమర్పించారు. 51 లక్షల మందికి అన్నప్రసాదాలు, బయట క్యూలలో మరో 20 లక్షల మందికి పాలు, టీ, కాఫీ, మజ్జిగ, స్నాక్స్ పంపిణీ చేశారు. శనివారం ఒక్కరోజే వెంగమాంబ అన్నప్రసాదభవనంలో అత్యధికంగా 93,950 మంది అన్నప్రసాదాలు స్వీకరించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి మెట్టు వద్ద పోటెత్తిన భక్తులు



తిరుమలకు నడిచి వెళ్లే భక్తులతో చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురం సమీపంలోని శ్రీవారి మెట్టు ఆదివారం రద్దీగా మారింది. ఈ మార్గాన ఐదు వేల మందికి మాత్రమే టైమ్ స్లాట్ దర్శన టోకెన్లు ఇచ్చారు. అయితే ఆదివారం దాదాపు పది వేల మంది ఇక్కడికి చేరుకున్నారు. టోకెన్లు లేకపోవడంతో కొందరు నిరాశతో వెనుదిరగ్గా.. చాలామంది తిరుమలకు నడిచి వెళ్లారు. సర్వదర్శనంలో స్వామిని దర్శించుకున్నారు. ఇక్కడి సెక్యూరిటీ సిబ్బంది స్థానిక ఆటోలను మాత్రం ముందుగా అనుమతించి.. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను ఆపేస్తున్నారని భక్తులు ఆరోపించారు. దీనివల్ల తమకు టోకెన్లు అందడంలేదంటూ వారు సెక్యూరిటీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

జనసంద్రం.. శివపురం

ఘనంగా చంద్రబాబు గృహప్రవేశం

ఉదయంనుంచి సాయంత్రం దాకా విందు భోజనాలు

ఆత్మీయ పలకరింపులు



గృహప్రవేశ కార్యక్రమంలో పూజలు

కుప్పం/శాంతిపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): వచ్చిపోయే జనాలు.. సుష్టుగా భోజనాలు.. ఆత్మీయ పలకరింపులు.. అడిగినవారికల్లా ఫొటో సెషన్లు.. ముఖ్యమంత్రి చంద్రబాబు గృహప్రవేశం జాతరను తలపించింది. ఆయన సొంతిల్లు నిర్మించుకున్న చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ శివపురం పరిసరాలు వేలాదిమంది జనసందోహంతో జాతరను తలపించింది. చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు ఆదివారం తెల్లవారుజామున 4.30-5.00 గంటల ప్రాంతంలో గృహప్రవేశం చేశారు. ఇంట్లో హోమం వెలయించి సంప్రదాయ బద్ధంగా పూజలు చేశారు. చంద్రబాబు దంపతుల కుమారుడు, మంత్రి నారా లోకేశ్, నారా బ్రాహ్మణి దంపతులు కూడా ఈ పూజల్లో పాల్గొన్నారు. ఉదయం 9-10 గంటల దాకా పూజలు కొనసాగాయి. 11.30 గంటలకు నలుగురూ నూతన గృహం ఎదుట ప్రత్యేకంగా నిర్మించిన షెడ్డులోకి వచ్చి ఆశీనులయ్యారు. ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 2.30 గంటలదాకా ఏకధాటిగా కొనసాగింది. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, పక్కనే ఏర్పాటు చేసిన భోజనశాలకు వెళ్లి.. అక్కడక్కడా భోజనం చేస్తున్న వారిని పలకరించారు. భోజనాలు ఎలా ఉన్నాయని కనుక్కున్నారు. అనంతరం నూతన గృహంలో కుప్పం నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ, బూత్ ఇన్‌చార్జులతో సమావేశమై కుప్పం నియోజకవర్గ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులతోపాటు, నారా లోకేశ్ దంపతులు కూడా ఆదివారం రాత్రి నూతన గృహంలోనే బస చేశారు. కాగా, కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆదివారం ఉదయం 7 గంటలకల్లా చంద్రబాబు నూతన ఇంటి వద్దకు చేరుకున్నారు. వీరందరికీ టిఫిన్లు, కాఫీలు పెడుతూ వచ్చారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు మధ్యాహ్న భోజనాలను ప్రారంభించగా.. సాయంత్రం మూడునాలుగు గంటల దాకా కొనసాగుతూనే ఉన్నాయి. సుమారు 30 వేలమంది నియోజకవర్గ ప్రజలు గృహప్రవేశానికి హాజరై భోజనాలు చేసివెళ్లారు.



చంద్రబాబు ఇంటి వద్ద భోజనం చేస్తున్న జనం

వరుస కట్టిన ఎమ్మెల్యేలు

చంద్రబాబు గృహప్రవేశానికి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు పలువురు హాజరయ్యారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తి నాని, జగన్మోహన్, మురళీమోహన్, గాలి భానుప్రకాష్, థామస్,ఆరణి శ్రీనివాసులు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తదితరులు హాజరయ్యారు.

బదిలీల కోసం అడ్డదారులు

● ఆఫీసు బేరర్ల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

చిత్తూరు సెంట్రల్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు ఈనెల 16 నుంచి జూన్ రెండు వరకు, ఉపాధ్యాయులకు ఈనెల 21 నుంచి జూన్ ఆరో తేదీ వరకు బదిలీలు జరగనున్నాయి. 98 ప్రభుత్వ శాఖల్లో సుమారు 15వేల మంది ఉద్యోగులు ఉండగా, ఉమ్మడి జిల్లా విద్యాశాఖలో ఏకంగా 15,454 మంది టీచర్లు పనిచేస్తున్నారు. బదిలీల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులకు (ఆఫీసు బేరర్లకు) కలెక్టర్ ఆమోదం తప్పనిసరి కానుంది. అయినా కొందరు అడ్డదారుల్లో ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏ సంఘం నేతల లేఖలైనా, బదిలీల్లో ప్రాధాన్యం పొందడానికి కలెక్టర్ ఆమోదం తప్పనిసరి. ఇలాంటి బేరర్ల సిఫారసు లేఖలను కలెక్టర్‌కు పంపాలి. కలెక్టర్ అధ్యక్షతన నియమించిన కమిటీ వీటిని పరిశీలించి, ఆయన ఆమోదం తీసుకున్నాకే ఆయా శాఖలకు పంపుతారు. అప్పుడే ఆఫీసు బేరర్లకు బదిలీల్లో ప్రాధాన్యం లభిస్తుంది. ఇక్కడే కొందరు తాము సంఘంలో నేతలమంటూ ఎన్నికల అధికారి, పరిశీలకుల సంతకం లేకుండా కేవలం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ద్వారా ముందు తేదీల్లో తెచ్చిన లేఖలు సమర్పిస్తున్నారన్న విమర్శలున్నాయి.

పడిపోయిన మామిడి ధర

● నిరాశ చెందుతున్న రైతులు

పాకాల,మే25 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల కారణంగా ఆలస్యంగా పూత రావడం.. దిగుబడి తక్కువగా ఉండటంతో ఈ ఏడాది మామిడి ధరలు ఆశాజనకంగా ఉంటాయని రైతులు భావించారు. కానీ, ఆశించిన ధరల్లేకపోవడంతో నిరాశ చెందారు. పాకాల మండలం దామలచెరువులోని మ్యాంగోనగర్‌లో సుమారు 120 మండీలున్నాయి. సీజన్‌లో ఒక రోజుకు.. ఒక్కో మండీలో 20 నుంచి 30 టన్నులు సరాసరి క్రయ విక్రయాలు జరుగుతాయి. పులిచెర్ల, ఎర్రావారిపాళ్యం, చిన్నగొట్టిగల్లు, రొంపిచెర్ల, పీలేరు. సదుం, సోమల, ఐరాల, పూతలపట్టు, పెనుమూరు, చంద్రగిరి మండలాల రైతులు ఇక్కడికి మామిడి కాయలు తీసుకొస్తారు. రూ.కోట్లలో వ్యాపార లావాదేవీలు జరుగుతాయి. సీజన్ ప్రారంభంలో బేనీషా నాణ్యతను బట్టి టన్ను రూ.25వేల నుంచి 35 వేలు, పులేరా రూ.15 వేల నుంచి 20వేలు, ఖాదర్ రూ.30 వేల నుంచి 40 వేలు, తోతాపురి కలర్ ఎగుమతికి రూ.18 వేల నుంచి 20 వేల వరకు ధరలు పలికాయి.



దామలచెరువు మార్కెట్‌లో అమ్మకాలకు సిద్ధంగా బేనీషా

ఇతర రాష్ట్రాల వ్యాపారులు వస్తే ధరలు పెరుగుతాయని రైతులు భావించి పరిమితిగానే కోతలు కోశారు. ఆదివారం ఒక్కసారిగా ధరలు పడిపోయాయి. బేనీషా రకం కాయలు గుజ్జుపరిశ్రమలు టన్ను 9 వేలకు కొనుగోలు చేశారు. ఖాదర్ రూ.27వేల నుంచి 28 వేలు, పుల్లేరా గుజ్జు పరిశ్రమలు టన్ను రూ.7వేలకు కొనుగోలు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వ్యాపారులు, దళారులు, మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు సిండికేట్‌గా మారి ధరలు నియంత్రిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభంకాని తోతాపురి కొనుగోళ్లు



జిల్లాలో అధిక విస్తీర్ణంలో పండించే తోతాపురి మామిడికాయల కొనుగోళ్లను గుజ్జు పరిశ్రమలు ఇంకా ప్రారంభించలేదు. కొనుగోలు ధర ప్రకటించలేదు. మామిడి తోటల్లో తోతాపురి కాయలు పక్వానికి వచ్చి కోత దశలో ఉన్నాయి. గుజ్జు పరిశ్రమలు ఇప్పటివరకు ధర ప్రకటించలేదు. మామిడి గుజ్జు తయారీ పరిశ్రమలు రైతుల నుంచి కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించి నాలుగురోజులైనా జిల్లా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. గిట్టుబాటు ధర కల్పిస్తామని కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు సమావేశమై చర్చించినా ఆచరణలోకి రాలేదు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు చేపట్టాలని మామిడి రైతులు వేడుకుంటున్నారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు



గోవిందరాజస్వామి హైస్కూల్‌లో పరీక్ష రాసేందుకు వస్తున్న అభ్యర్థులు



తిరుపతి(కలెక్టరేట్), మే 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 5,261మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉంది. వీరిలో ఉదయం రాత పరీక్షలకు 2,941 మంది, మధ్యాహ్నం సెషన్‌కు 2,929 మంది హాజరయ్యారు. తిరుపతిలో 13 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి. ఉదయం 9.30 నుంచి 11.30 వరకు పేపర్-1.. మధ్యాహ్నం 2.30 నుంచి 4.30గంటల వరకు పేపర్-2 పరీక్షలు నిర్వహించారు. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించలేదు. దీంతో పలువురు కన్నీరు పెట్టారు. ఈ పరీక్షలను రాష్ట్ర పరిశీలకుడు కోన శశిధర్, జాయింట్ సెక్రటరీ అజ్మీరా, కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పరిశీలించారు.



బొట్టు పెట్టి పరీక్షకు పంపి..



సమయం దాటి వచ్చారని అనుమతించకపోవడంతో గేటు బయటే అభ్యర్థులు

కాలిబాటలో చిరుత సంచారం

తిరుమల, మే25(ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలి నడక మార్గంలో ఆదివారం రాత్రి చిరుత సంచారం కలకలం సృష్టించింది. ఈ మార్గంలోని 350వ మెట్టువద్ద చిరుతను చూసిన కొందరు భక్తులు హడలిపోయారు. అక్కడి నుంచి దూరంగా వెళ్లిపోయారు. చిరుతసంచార సమాచారాన్ని సమీపంలోని సిబ్బందికి తెలియజేశారు. దీంతో విజిలెన్స్ అధికారులు అప్రమత్తమయ్యారు. మెగాఫోన్‌తో విజిలెన్స్ సిబ్బందిని ఏర్పాటు చేసి భక్తులను గుంపుగా తిరుమలకు పంపారు. ఒంటరిగా ఎవరూ వెళ్లొద్దని సూచించారు. అలాగే అటవీశాఖ సిబ్బంది చిరుత సంచరించిన ప్రదేశానికి చేరుకున్నారు. చిరుత అడవిలోకి వెళ్లిపోయేలా శబ్దాలు చేశారు.

అంజేరమ్మ కనుమ వద్ద ఫైవ్ స్టార్ రిసార్ట్



రిసార్టుకు ప్రతిపాదించిన స్థలం

వడమాలపేట,మే 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి-చెన్నై జాతీయ రహదారి వడమాలపేట సమీపంలోని అంజేరమ్మ కనుమ వద్ద ఫైవ్ స్టార్ రిసార్ట్ నిర్మాణం కానుంది. దీనికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ రిసార్టుకు ఎస్వీ పురం రెవెన్యూ సర్వే నెంబరు 428/2,3 లలో 12.70 ఎకరాలను పర్యాటక శాఖకు ప్రభుత్వం కేటాయించింది. అద్దె ప్రాతిపదికన 66 ఏళ్ల పాటు.. నిర్వహణ ప్రాతిపదికన 33 ఏళ్లపాటు పొడిగించుకోడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఒడిశాకు చెందిన బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్ సంస్థ రూ.150 కోట్లతో రిసార్టు నిర్మాణం చేపట్టనుంది. నగిరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవతో ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చింది. ఇటీవల టూరిజం ఉన్నతదాధికారులు ఈ స్థలాన్ని పరిశీలించారు. ఈ రిసార్టు ద్వారా దాదాపు 350 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.



జస్టిస్ పుగలేండి - జస్టిస్ నితిన్ సాంబ్రే - జస్టిస్ అలోక్ జైన్ - జస్టిస్ కామేశ్వర్ రాయ్

శ్రీవారి సేవలో హైకోర్టుల న్యాయమూర్తులు

తిరుమల శ్రీవారిని ఆదివారం పలు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. వారిలో.. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుగలేండి, బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నితిన్ సాంబ్రే, పంజాబ్, హరియాణా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలోక్ జైన్, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కామేశ్వర్ రాయ్ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తేరుపై రంగనాథస్వామి అభయం



తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టులోని ప్రసన్న రంగనాథస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న రంగనాథస్వామి తేరుపై కొలువుదీరి గ్రామ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

శిలాతోరణం సర్కిల్ వరకు క్యూలైన్

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: రూ.3.11 కోట్లు

శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 90,211

తలనీలాలు సమర్పించినవారు: 43,346



సుప్రభాత సేవలో సింగర్ స్మిత



సింగర్ స్మిత తిరుమల శ్రీవారిని సుప్రభాతసేవలో దర్శించుకున్నారు. ఆదివారం వేకువజాము ఆలయంలో జరిగిన సుప్రభాతసేవలో పాల్గొన్న ఆమె పఠనం అనంతరం గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఆటోపై విద్యుత్ తీగలు పడి యువకుడి మృతి



మృతిచెందిన రఫీ

పాకాల, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మ్యాంగోనగర్‌లో ఆదివారం తెల్లవారుజామున ఆటోపై విద్యుత్ తీగలు తెగిపడిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. దామలచెరువు ఆజాద్‌నగర్ చెరువులో ఇండ్లకు చెందిన రఫీ (27), చాంద్‌బాషా మ్యాంగోనగర్‌లో ఆటో పార్కు చేసి అందులోనే నిద్రిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున గాలికి విద్యుత్ తీగలు తెగి ఆటోపై పడ్డాయి. రఫీ అక్కడికక్కడే మృతి చెందాడు. చాంద్‌బాషా గాయాలతో బయటపడ్డాడు. ఆటో పాక్షికంగా కాలింది. పాకాల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి



తిరుచానూరు, మే 25(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీసీడీ శేఖర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వారికి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ధ్వజస్తంభానికి నమస్కరించి, అనంతరం సన్నిధిలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

200 మందికి వైద్య పరీక్షలు



చంద్రగిరి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండపంపల్లెలో టీడీపీ నేత పేస్ రాయల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ నేతృత్వంలో మండపంపల్లె, పరిసర గ్రామాల ప్రజలు సుమారు 200 మందికి హాస్పిటల్ వైద్యులు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవీంద్ర, రాజశేఖర్, హాస్పిటల్ వైద్యురాలు దుర్గాశ్రావణి, వాలంటీర్ ఎగ్జిక్యూటివ్ మౌళిధర్, సిబ్బంది మోహన్, ప్రియ, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరానికి హాజరైన వైద్యులు

భాకరాపేట, మే 25(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట హరిప్రియ మెడికేర్‌లో తిరుపతికి చెందిన వినూత్న అడ్వాన్స్‌డ్ న్యూరో సైన్స్ సెంటర్ వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 70 మంది హాజరుకాగా పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు వినూత్న ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయండి

భాకరాపేట, మే 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని వైసీపీ మండలాధ్యక్షుడు సింహాల మోహన్ కోరారు. ఆదివారం భాకరాపేట పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో పెన్షన్ల పంపు, ఉచిత గ్యాస్ తప్ప మిగితా పథకాలు ఏమీ అమలు కాలేదన్నారు. పాఠశాలలు త్వరలో ప్రారంభమవుతున్నా ఇంతవరకు తల్లికి వందనం పథకం అమలు కాలేదన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయకపోవడం బాధాకరమన్నారు.

మూగజీవాలకు ఆహారంగా చెత్త, వ్యర్థాలు



తిరుపతిరూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీలోని వీధుల్లో రోడ్డుకు ఆనుకుని పలు చోట్ల చెత్త, వ్యర్థాలను పడేసి వెళుతున్నారు. దీంతో అక్కడ సంచరించే మూగజీవాలు ప్లాస్టిక్‌తో పాటు కుళ్లిన వ్యర్థాలను తిని అనారోగ్యం పాలవుతున్నాయి. ఖాళీస్థలంలో చెత్తవేస్తే అపరాధం వేస్తామని అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినా కొందరు గుట్టుచప్పుడుకాకుండా పడేసి వెళుతున్నారు. అటువైపుగా వెళ్లే ఆవులు తింటున్న దృశ్యం ఆదివారం ఉదయం కనిపించింది.

ప్రైవేటు భూమినీ వదల్లేదు



ప్రైవేటు భూమిని ఆక్రమించి సాగుచేసిన పంట

- కబ్జాచేసిన ఆక్రమణదారులు
- పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- పట్టించుకోని రెవెన్యూ, పోలీస్ అధికారులు

పుత్తూరు అర్బన్, మే 25(ఆంధ్రజ్యోతి): నారాయణవనం మండలంలో ప్రభుత్వ భూములకే కాదు.. ప్రైవేటు భూములకూ రక్షణ లేకుండా పోయింది. నారాయణవనంలో సర్వే నెంబర్ 356/1లో 4.65 ఎకరాల్లో కొంత భూమి ఆక్రమణదారుల చెరలో ఉందని బాధితుడు చలపతిరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి మీద భక్తితో ఆయన 2007లో 4.65 ఎకరాల వ్యవసాయ భూమిని నారాయణవనంలో కొన్నారు. వృత్తిరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆ భూమి విషయంలో 2022 వరకు ఎటువంటి సమస్య తలెత్తలేదు. వైసీపీ హయాంలో.. 2023 డిజిటల్ సర్వేలో భాగంగా భూమి తక్కువగా ఉన్నప్పటికీ ఎక్కువ భాగం రిజిస్టర్ చేసుకున్నారంటూ చలపతిరావుకు రెవెన్యూ అధికారుల నుంచి నోటీసు అందింది. అదనపు భూమిని ఆక్రమించారంటూ అందులో పేర్కొన్నారు. దీంతో కంగుతిన్న ఆయన తన వద్ద ఉన్న రికార్డులతో మండల రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగారు. నేటికీ సమస్యల పరిష్కారానికి నోచుకోలేదు. కాగా, తన 4.65 ఎకరాల్లో కొంత భూమిని ముగ్గురు వ్యక్తులు ఆక్రమించారని ఆయన కోర్టును ఆశ్రయించారు. అందుకు కోర్టు కూడా పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్‌ను జారీ చేసింది. ఈ ఆర్డర్‌తో నారాయణవనం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని చలపతిరావు వాపోయారు. తన భూమికి పూర్తిస్థాయిలో సర్వే చేయించి, ఆక్రమణదారుల నుంచి ఇప్పించాలని రెవెన్యూ అధికారులను కోరినా ఫలితం లేదన్నారు. చివరకు కలెక్టర్, డీఆర్వో, ఆర్డీవోలను సైతం కలిసి సమస్యను విన్నవించగా ఖాతరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వమైనా దృష్టి సారించి తనకు న్యాయం చేయాలని ఆయన వేడుకుంటున్నారు.

ఆటోలకే ప్రాధాన్యం ఇస్తారా?

- శ్రీవారి మెట్టువద్ద టీటీడీ సెక్యూరిటీపై భక్తుల ఆగ్రహం





శ్రీవారి మెట్టు మార్గంలో పంప్ హౌస్ వద్ద సెక్యూరిటీతో ఘర్షణ పడుతున్న భక్తులు - శ్రీవారి మెట్టు మార్గంలో నిలిచిన వాహనాలు

చంద్రగిరి, మే 25(ఆంధ్రజ్యోతి): 'సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారిని పట్టించుకోవడంలేదు. స్థానిక ఆటోలకు ప్రాధాన్యం ఇచ్చి.. ముందుగా అనుమతిస్తున్నారు. దీంతో మాకు దర్శన టోకెన్లు అందడంలేదు. దీనిని అవకాశంగా తీసుకుని ఆటోల వాళ్ల శ్రీనివాసపురం నుంచి శ్రీవారి మెట్టుకు అధికంగా బాడుగ వసూలు చేస్తున్నారు' అంటూ భక్తులు ఆగ్రహించారు. చంద్రగిరి మండలం శ్రీవారి మెట్టు వద్ద టీటీడీ సెక్యూరిటీ సిబ్బందితో ఆదివారం కొందరు భక్తులు వాగ్వాదానికి దిగారు. ఈ మార్గాన నడిచి తిరుమల వెళ్లడానికి భక్తులు పోటెత్తారు. ఈ మార్గంలో వెళ్లేవారికి టైమ్ స్లాట్ దర్శన టోకెన్లు ఉదయం 6 గంటల నుంచి ఇస్తారు. దీంతో వేకువ జామున 2 గంటల నుంచే భక్తులు శ్రీనివాసమంగాపురానికి చేరుకుంటున్నారు. ఇక్కడ రద్దీ పెరగడంతో శ్రీవారిమెట్టు మార్గంలోని పంప్ హౌస్ వద్ద సెక్యూరిటీ సిబ్బంది బారికేడ్లు పెట్టి వాహనాలను వరుస క్రమంలో నిలిపేస్తారు. ఉదయం 6 గంటల తర్వాత భక్తులను శ్రీవారిమెట్టు వద్దకు అనుమతిస్తున్నారు. ఇక్కడ మరుగుదొడ్లు, మౌలిక వసతులు లేకపోవడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇక, శ్రీనివాస మంగాపురంలోని కొందరు ఆటోల వాళ్లనే సెక్యూరిటీ సిబ్బంది ముందుగా అనుమతిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. దీంతో టోకెన్ల కోసం ముందుగా వెళ్లాలనుకునే భక్తుల వద్ద ఒక్కొక్కరికి రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నారని విమర్శించారు. శ్రీవారిమెట్టు మార్గంలో భక్తులకు టోకెన్లు రోజుకు ఒక్కోలా ఇస్తుండటంతో ఎక్కడ దొరకదనే ఉద్దేశంతో వేలాదిమంది భక్తులు ఒక్కసారిగా వస్తుండటంతో తొక్కిసలాట జరుగుతోంది. ఈ క్రమంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా.. శ్రీవారి మెట్టుకు అనుమతించే విషయంలో ఎలాంటి అపోహలకు తావులేకుండా టీటీడీ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

టీటీడీ ఉచిత బస్సు ఏర్పాటు చేయాలి

శ్రీనివాసమంగాపురం నుంచి ప్రతి రోజూ ఉదయం టీటీడీ సరిపడా ఉచిత బస్సులను ఏర్పాటు చేస్తే భక్తులు నిలువు దోపిడీకి గురికారు. ఆటోలలో నిబంధనలకు విరుద్ధంగా భక్తులను ఎక్కించుకోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముంది.

- సుబ్రమణ్యంయాదవ్, బీజేపీ నేత, ఎ.రంగంపేట

తొక్కిసలాట లేకుండా..

ప్రతిరోజూ ఉదయం శ్రీవారిమెట్టు వద్ద టోకెన్ల కోసం తొక్కిసలాట జరుగుతుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సరిపడా టోకెన్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే ఇబ్బంది లేకుండా భక్తులు టోకెన్లు తీసుకుని కాలినడకన తిరుమలకు వెళతారు.

- యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, మూలస్థాన ఎల్లమ్మ ఆలయ మాజీ చైర్మన్, చంద్రగిరి

పరీక్షా కేంద్రాల్లో అధికారుల తనిఖీ



తిరుపతిలో ఆదివారం జరిగిన యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలను అధికారులు తనిఖీ చేశారు. రాష్ట్ర పరిశీలకుడు కోన శశిధర్, జాయింట్ సెక్రటరీ అజ్మీరా, కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పలు కేంద్రాలను సందర్శించారు. పరీక్షల తీరును పరిశీలించారు.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి



సెక్యూరిటీపై విమర్శలు సరికాదు: టీటీడీ

తిరుమల, మే25(ఆంధ్రజ్యోతి): శ్రీవారిమెట్టు మార్గంలో సెక్యూరిటీ సిబ్బందిపై విమర్శలు తగవని, భక్తుల రద్దీ నిర్వహణకు విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది విస్తృత చర్యలు చేపడుతున్నారని టీటీడీ ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలిపింది. 'శనివారం టోకెన్ ఉన్న 5 వేల భక్తులతో పాటు టోకెన్లులేని మరో 7 వేల మంది శ్రీవారివారి మెట్టు మార్గం ద్వారా తిరుమలకు చేరుకోవడంతో టోకెన్ సెంటర్ పరిసరాల్లో వాహనాలు.. భక్తుల రద్దీ ఏర్పడింది. క్యూలైన్లు తక్కువగా ఉండటంతో అత్యవసర సేవలకు అంతరాయం వంటి సమస్యలు ఏర్పడ్డాయి. ఈనేపథ్యంలో అధికారుల ఆదేశాల మేరకు ఆదివారం పంప్ హౌస్ వద్ద, ఓల్డ్ మయూరి డెయిరీ, రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మొత్తం మూడు కట్-ఆఫ్ పాయింట్లను ఏర్పాటు చేసి, భక్తుల వాహనాలను దశలవారీగా టోకెన్లను అనుగుణంగా అనుమతించారు. నడిచి వెళతామని కొందరు భక్తులు కోరగా వారిని అనుమతించారు. దీన్ని కొందరు వీడియోలు తీసి విజిలెన్స్ సిబ్బంది అడ్డదారిలో టోకెన్ల కోసం పంపుతున్నారని ప్రచారం చేయడం అవాస్తవం. పనిగట్టుకుని సిబ్బందిని విమర్శించడం భావ్యంకాదు' అని ఆ ప్రకటనలో టీటీడీ పేర్కొంది.

మహానాడు సక్సెస్ అయ్యేలా దీవించమని కోరా

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



తిరుమల, మే25(ఆంధ్రజ్యోతి): కడపలో జరుగనున్న మహానాడు కార్యక్రమం సక్సెస్ అయ్యేలా దీవించమని శ్రీవారిని కోరినట్టు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం వేకువజామున సుప్రభాత సేవలో పాల్గొన్న ఆయన.. శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తమ పార్టీ మహానాడుకు విజయవంతం కావాలని తిరుమలకు వచ్చి శ్రీవారి ఆశీస్సులు పొందామన్నారు. కాగా, కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తిరుమలలో భక్తులకు సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు అన్నప్రసాదాల నాణ్యత పెరిగిందని ఇటీవల కేంద్ర మంత్రులు సీఎం చంద్రబాబుతో చెప్పి ప్రశంసించారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

మీ పార్టీకీ ద్రోహం చేస్తారేమో చూడండి: వైసీపీ

తిరుపతి(ఎంఆర్‌పల్లె), మే 25(ఆంధ్రజ్యోతి): 'తిరుపతి రూరల్, పాకాల నుంచి కొందరు వైసీపీ నేతలు ఇటీవల టీడీపీలో చేరారు. వారంతా వైసీపీలో ఉండి టీడీపీ గెలుపునకు పనిచేశారని ఎమ్మెల్యే నాని చెప్పారు. అలాంటి వారు భవిష్యత్తులో మీ పార్టీకీ ద్రోహం చేస్తారేమో చూడండి' అని వైసీపీ నేత మునీశ్వర్‌రెడ్డి అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ శ్రేణుల్లోనూ ఇదే భయం ఉందని పేర్కొన్నారు.





ప్రమాదానికి గురైన టెంపో, కారు

మొదటి ఘాట్‌లో అదుపు తప్పిన వాహనాలు

తిరుమల, మే25(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌లో ఆదివారం ఓ కారు, వ్యాను అదుపు తప్పాయి. బెంగళూరుకు చెందిన ఓ కుటుంబం శ్రీవారిని దర్శించుకుని తమ కారులో ఆదివారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. మొదటి ఘాట్‌లోని ఒకటో మలుపు వద్ద కారు అదుపు తప్పి కొండను ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు యాత్రికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అలాగే ఎనిమిదో మలుపు వద్ద సాయంత్రం ఓ టెంపో అదుపుతప్పి ఎడమైపునున్న చిన్నపాటి గట్టుపైకి దూసుకుపోయింది. డ్రైవర్ అప్రమత్తమై బ్రేకులు వేయడంతో ప్రమాదం తప్పింది.



ఇంగ్లాండ్ సిరీస్‌కు ఆశీస్సులు ఇవ్వమని

శ్రీవారిని కోరుకున్నా

- టీమ్ ఇండియా ఫీల్డింగ్ కోచ్ దిలీప్

తిరుమల, మే 25 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోతున్న ఇంగ్లాండ్ సిరీస్‌కు ఆశీస్సులు ప్రసాదించాలని శ్రీవారిని కోరుకున్నట్టు టీమ్ ఇండియా ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్ తెలిపారు. తిరుమలేశుడిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఇంగ్లాండ్ సిరీస్ చాలా చాలెంజింగ్‌గా ఉండబోతుందన్నారు. ఇది చాలా ముఖ్యమైన సిరీస్ అని చెప్పారు. ప్రస్తుతం ఉన్నది యంగ్ టీమ్ అన్నారు. ఇక, బీసీసీఐ నిర్వహిస్తున్న ఐపీఎల్‌లోనూ యువ క్రికెటర్లు అద్భుతంగా రాణిస్తున్నారని తెలిపారు. అనుభవం కలిగిన స్థానిక, ఫారిన్ క్రికెటర్లతో యువత కలిసి హైప్రెజర్‌లో ఆడటం ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లో త్వరగా సెటిల్ అయ్యే అవకాశాన్ని ఇస్తుందని అభిప్రాయపడ్డారు.



రవినాయుడి జన్మదినం సందర్భంగా మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో రుయా ఆస్పత్రిలో అన్నదానం చేస్తున్న ఎన్వీ ప్రసాద్, ఆర్సీ మునికృష్ణ

అన్నదానం

తిరుపతి, మే 25(ఆంధ్రజ్యోతి) : తిరుపతి రుయా ఆసుపత్రి వద్ద తిరుపతి నగర టీడీపీ ప్రధాన కార్యదర్శి నైనార్ మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతోపాటు 500 మందికిపైగా అన్నార్థులకు శాప్ ఛైర్మన్ చేతుల మీదుగా భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఎన్వీ ప్రసాద్, కార్పొరేటర్లు అన్నా అనిత యాదవ్, నరసింహాచారి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.







కుప్పంలో ఆదివారం జరిగిన సీఎం చంద్రబాబు గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు చెబుతున్న చంద్రగిరి, తిరుపతి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సగుణమ్మ

కల్కి ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలి

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), మే 25(ఆంధ్రజ్యోతి): కల్కి ఆశ్రమం బీఎన్‌కండ్రిగ మండలం కల్లివెట్టు గ్రామంలో ఆక్రమించిన సర్వే నెంబరు 295లోని 21 ఎకరాల అటవీ భూములను స్వాధీనం చేసుకోవాలని హేతువాద సంఘం నాయకులు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కల్కి ఆశ్రమం వారు కలివెట్టు గ్రామం వద్ద అంజూరు అటవీ భూమిని ఆక్రమించి కట్టడాలు చేపట్టారన్నారు. అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు కల్కిని కాపాడేందుకు నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. అటవీ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ తీసుకుని అటవీ భూములను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని కోరారు.

టీడీపీ నూతన కమిటీల ఎన్నిక వాయిదా

తిరుపతి అర్బన్, మే 25(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోకి వచ్చే న్యూమంగళం, సప్తగిరికాలనీ పంచాయతీలలో టీడీపీ నూతన కమిటీల నియామకం వాయిదాపడింది. వారం క్రితం రణధీరపురం, మంగళం క్వార్టర్స్, తిరుమలనగర్ పంచాయతీలకు టీడీపీ కమిటీలు కొలువుదీరిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఈ రెండు పంచాయతీల్లోనూ ఎన్నికలు నిర్వహించగా అభ్యర్థులు, ఓటర్ల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. రెండు వర్గాల మధ్య వివాదాలు తలెత్తడంతో ఎన్నికల నిర్వాహకులైన మండల నాయకులు సర్దుబాటుకు ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. సమస్యను ఎమ్మెల్యే నాని దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సమక్షంలోనూ ఇరువర్గాల మధ్య సయోధ్య కుదరలేదు. మహానాడు తర్వాత నూతన కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించి మరోసారి వాయిదావేశారు.

డాక్టరేట్ ప్రదానం



మోహనప్రసాదరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 25 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ జియాలజీ పరిశోధకులు వై.హెచ్.పి.ఎం. మోహనప్రసాదరావు డాక్టరేట్ పొందారు. ఇంటిగ్రేటెడ్ హైడ్రోజియోమార్ఫాలజికల్ స్టడీస్ ఆఫ్ హంద్రీ రివర్ బేసిన్ యూజింగ్ జియోస్పేషియల్ టెక్నిక్స్, కర్నూలు డిస్ట్రిక్, ఆంధ్రప్రదేశ్, ఇండియా అంశంపై ప్రొఫెసర్ టి.మధు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

వెంకటలక్ష్మికి..



వెంకటలక్ష్మి

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పరిశోధకురాలు బి.వెంకటలక్ష్మి డాక్టరేట్ పొందారు. 'భారత విదేశాంగ విధానం - ఎన్‌డీఏ పాలనలో పొరుగు దేశాల పట్ల కొనసాగింపు-మార్పులు' అనే అంశంపై ప్రొఫెసర్ బీవీ మురళీధర్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేశారు. ప్రస్తుతం వెంకటలక్ష్మి పీలేరు ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.

నేడు ఆర్టీసీ ఎండీ, ఈడీల రాక

తిరుపతి(ఆర్టీసీ), మే 25(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు అప్పలరాజు, చెంగల్‌రెడ్డి (విజయవాడ ప్రధాన కార్యాలయం), చంద్రశేఖర్(కడప జోన్) సోమ, మంగళవారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారు. వారు మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి సత్యవేడు డిపోకు వెళతారు. అనంతరం పుత్తూరు డిపోను సందర్శించి రాత్రికి తిరుపతికి చేరుకుని బసచేస్తారు. మంగళవారం ఉదయం పలమనేరు, కుప్పం డిపోలను సందర్శించి తిరుగుప్రయాణమవుతారు. అత్యధిక నష్టాలతో నడుస్తున్న ఈ నాలుగు డిపోల పరిస్థితిపై సమీక్షిస్తారు. నష్టాల నుంచి గట్టెక్కడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తారు.

2నుంచి గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

తిరుపతి అర్బన్, మే 25(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వచ్చేనెల 2నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, వైట్ పెయింట్, రంగవల్లులు, విద్యుత్, పుష్పాలంకరణ ఏర్పాట్లు విస్తృతంగా జరుగుతున్నాయి. 29న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఒకటో తేదీ సాయంత్రం అంకురార్పణ, 2న ఉదయం ధ్వజారోహణం, రాత్రి పెద్దశేష, 3న ఉదయం చిన్నశేష, రాత్రి ముత్యపుపందిరి, 5న ఉదయం కల్పవృక్ష, రాత్రి సర్వభూపాల, 6న ఉదయం మోహినీ అవతారం, రాత్రి గరుడ, 7న ఉదయం హనుమంత, రాత్రి గజ, 8న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ, 9న ఉదయం మహారథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 10న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వెరిటాస్ సైనిక్ స్కూల్‌లో ఎన్‌సీసీ బహుళ వార్షిక శిబిరం



శిక్షణా శిబిరానికి హాజరైన విద్యార్థులు

రామచంద్రాపురం, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుట్టుగుంట రామాపురంలో ఉన్న వెరిటాస్ సైనిక్ స్కూల్‌లో ఆదివారం నుంచి జూన్ 3వ తేదీ వరకు ఎన్‌సీసీ బహుళ వార్షిక శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రూప్ కెప్టెన్ కమాండింగ్ ఆఫీసర్, ఎన్‌సీసీ అధికారి పోపోలిష్(ఆర్‌జే ఆత్రే) తెలిపారు, చిత్తూరు, తిరుపతి, కడప, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల నుంచి ఆదివారం 700మంది క్యాడెట్లు ఈ శిబిరంలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ఈ శిబిరం ద్వారా ఎన్‌సీసీ క్యాడెట్లకు సాంస్కృతిక మార్పిడి, పరస్పర అవగాహన, జాతీయ సమైక్యతను ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణాధికారి లక్ష్మీనరసింహ, ఉపేందర్‌రెడ్డి, ప్రియ, హేమలత, శిరీష తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భక్తులకు వీఐపీ బ్రేక్ దర్శనాలు అభినందనీయం

తెలంగాణ ప్రభుత్వ విప్ ఐలయ్య



ఐలయ్య

తిరుమల, మే25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి తిరుమలకు వస్తున్న భక్తులకు వీఐపీ బ్రేక్ దర్శనాలు కల్పిస్తున్న ఏపీ ప్రభుత్వానికి, టీటీడీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలంగాణ ప్రభుత్వ విప్ ఐలయ్య తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తన వివాహ వార్షికోత్సవం సందర్భంగా శ్రీవారిని దర్శించుకున్నట్టు తెలిపారు. రెండు రాష్ట్రాల ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకున్నట్టు చెప్పారు.

రేణిగుంటకు సబ్‌స్టేషన్లు కావాలి

విస్తరిస్తున్న పరిశ్రమలు, కాలనీలు - పెరుగుతున్న విద్యుత్ వినియోగం



తిరుపతి(ఆటోనగర్), మే 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని రేణిగుంటకు మరో నాలుగు సబ్‌స్టేషన్లు నిర్మించాల్సిన అవసరముంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రేణిగుంట మండలంలో పారిశ్రామిక ప్రగతి ఊపందుకుంది. చిన్న పరిశ్రమలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. అలాగే గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన పలు కాలనీలు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ క్రమంలో విద్యుత్ అవసరాలు కూడా పెరుగుతున్నాయి. గాజులమండ్యం పారిశ్రామికవాడకు దగ్గరలోని నీలిసానిపేట, అడుసుపాళెం, మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం, కృష్ణాపురం ప్రాంతాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయడం వల్ల నూతనంగా ఏర్పడిన కాలనీలు మామండూరు, అంకమనాయుడు మిట్ట, అన్నాసామిపల్లి, జీపాళెం, అడుసుపాళెం, కుర్రకాలువ, విప్పమానుపట్టెడతో పాటు పారిశ్రామికవాడల విస్తరణకు ఉపయోగపడతాయి. గాజులమండ్యం పారిశ్రామికవాడలో పరిశ్రమల విస్తరణ, విమానాశ్రయం సమీపంలో పరిశ్రమలు విస్తరణ జరిగే అవకాశముంది. సమీపంలోని ఏర్పేడు మండలంలో భారీ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా మారుతుంది.

రేణిగుంట సబ్ డివిజన్లలో విద్యుత్ వినియోగం వివరాలు..

గృహ విద్యుత్ వినియోగదారులు(ఎల్‌టి) సర్వీసులు 42,872

వ్యాపార సర్వీసులు 5052

పరిశ్రమల సర్వీసులు 526

వ్యవసాయ సర్వీసులు 2,762

11కేవీ హెచ్‌టీ సర్వీసులు 106

33కేవీ సర్వీసులు 10

132 కేవీ సర్వీసులు రైల్వేతో కలిపి 4

ఈ సర్వీసులకు ప్రస్తుతం ఆరు 33-11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లతో 31 ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతోంది. పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో నాలుగు 33-11 కేవీ సబ్‌స్టేషన్లు మంజూరు చేయాల్సిన అవసరముంది.

హోరాహోరీగా సీపీఎల్

తిరుపతి(క్రీడలు), మే 25(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ మైదానంలో చిత్తూరు ప్రీమియర్ లీగ్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆదివారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్‌చాలెంజ్ తిరుచానూరు జట్టు 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన స్పార్టన్ వారియర్స్ 18.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాచ్ గెలుపులో దినేష్‌వర్మ కీలకపాత్ర పోషించాడు. 42బంతుల్లో 80(3సిక్కులు, 9ఫోర్లు)పరుగులు సాధించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సొంతం చేసుకున్నాడు. అతిథులు ఊకా విజయ్‌కుమార్, వేణుగోపాల్‌నాయుడు, దివాకర్‌రెడ్డి అందజేశారు. మధ్యాహ్నం మ్యాచ్‌లో ఆదిత్య జట్టు నిర్దేత 20 ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 195పరుగులు సాధించింది. పాయ్ వైస్రాయ్ జట్టు 147 పరుగులకే అన్ని వికెట్లు కోల్పోయి లక్ష్య సాధనలో చతికిలపడింది. ఆదిత్య జట్టుకు చెందిన అభిషేక్‌రెడ్డి 56 బంతుల్లో 97పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌కు ఎంపిక కాగా సీడీసీఏ అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి, కార్యదర్శి రవి అందజేశారు.



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న దినేష్‌వర్మ - అభిషేక్‌రెడ్డి

ఒక్క ఆకు ఉంటే ఒట్టు..!



అది భారీ రావిచెట్టు.. చూద్దామన్నా ఒక్క ఆకూ లేదు. ఎండిపోయిందనుకుని ప్రకృతి ప్రేమికులు బాధ వ్యక్తం చేస్తున్నారు. సహజంగా వసంత రుతువు ప్రారంభంలో వృక్షాల ఆకులు రాలడం.. అదే రుతువు చివర్లో చిగురించడం మామూలే. గ్రీష్మంలో పూర్తిస్థాయిలో ఆకులు విచ్చుకొని పచ్చదనం సంతరించుకుంటుంది. అయితే ఇక్కడ గ్రీష్మరుతువు చివరి దశలో ఆకులు రాలిపోవడం, చూద్దామన్నా ఒక్క ఆకూ కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ దృశ్యం అన్నమయ్య మార్గం గెస్టలైన్‌డేస్ హోటల్ సమీపంలో చోటుచేసుకుంది.

- తిరుపతి అర్బన్ (ఆంధ్రజ్యోతి)

ఘనంగా తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే

తిరుపతి అర్బన్, మే 25(ఆంధ్రజ్యోతి): రీచ్‌గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక బాలాజీ కాలనీలోని జ్యోతిరావుపూలే విగ్రహం నుంచి నాలుగుకాళ్ల మండపం వరకు తిరంగర్యాలీ నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్ విజయోత్సవాన్ని జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ర్యాలీని ప్రారంభించి, పాల్గొన్నారు. యువత గుండెనిండా దేశభక్తి నింపుకోవాలన్నారు. సైనికులు, ప్రధాని మోదీ వల్లే ఆపరేషన్ సింధూర్ సక్సెస్ అయ్యిందని గుర్తు చేశారు. రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల మాట్లాడుతూ ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళి అర్పిస్తూ తిరంగ ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ మునికృష్ణ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, కార్గిల్ యుద్ధ వీరులు, మాజీ సైనికులు ఏపీ నాయుడు, రీచ్ గ్లోబర్ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ మొర్రిమేకల దేవరాజులు, సూరా శ్రీదేవి, సరళ, చంద్రబాబు, గుర్రప్ప, ఉపాధ్యాయులు సాంబిరెడ్డి, బాలాజీ, రాజ తదితరులు పాల్గొన్నారు.

జంట మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

శ్రీకాళహస్తి, మే 25(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రాం బంధంతో విషాదాంతమైన జంట మృతదేహాలకు పోలీసులు పోస్టుమార్టం పూర్తిచేశారు. విశాఖకు చెందిన పద్మ శ్రీకాళహస్తికి చెందిన సురేష్ మృతి చెందిన విషయం తెలిసిందే. పోలీసులు ఆదివారం రెండు మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేశారు. పద్మ మృతదేహాన్ని ఆమె కుమారుడికి అప్పగించారు. సురేష్ మృతదేహాన్ని అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మాతమ్మగుడికి రూ.17వేలు విరాళం



ఆలయ నిర్వాహకులకు నగదు అందిస్తున్న సర్పంచ్ కోటేశ్వరరావు

తిరుపతిరూరల్, మే25(ఆంధ్రజ్యోతి): లింగేశ్వరనగర్ పంచాయతీ బాదూర్ వీధిలోని మాతమ్మగుడికి గ్రామ సర్పంచ్ మునుగు కోటేశ్వరరావు దంపతులు ఆదివారం రూ.17వేలు విరాళంగా అందజేశారు. జాతర(కొలుపు) ఉత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కు చెల్లించారు. వీరికి ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు అందించారు.

రేపు 'తరమెల్లి పోతున్నదో' సాంఘిక నాటక ప్రదర్శన

నిర్వాహకులు కోనేటి సుబ్బరాజు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరాజు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 25 (ఆంధ్రజ్యోతి): సుబ్బరాజు నాట్య కళా పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన 'తరమెల్లి పోతున్నదో' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించనున్నారు. నెలనెలా నాటక ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం 5 గంటలకు మహతి కళా క్షేత్రంలో నాటక ప్రదర్శన ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సుబ్బరాజు నాట్య కళా పరిషత్ వ్యవస్థాపకులు, కళా తపస్వి కోనేటి సుబ్బరాజు వెల్లడించారు. 2012 నుంచి నిరంతరాయంగా నెలనెలా నాటక ప్రదర్శన కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. ఈ క్రమంలో గుంటూరుకు చెందిన కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ వారిచే బొమ్మిడి రామకృష్ణ రాసిన 'తరమెల్లి పోతున్నదో' నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు చెప్పారు. సుబ్బరాజు కళా పరిషత్ ఆధ్వర్యంలో భక్తిరస పద్య నాటకం 'లవకుశ' ప్రదర్శిస్తామన్నారు. ఈ సమావేశంలో నాటక కళాకారులు గోపాలరావు, మల్లికార్జున పాల్గొన్నారు.

తిరుమలరెడ్డికి ఘన సన్మానం



తిరుమలరెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, మే 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండలాధ్యక్షుడిగా రెండవసారి ఎన్నికైన తిరుమలరెడ్డిని ఆయన స్వగృహంలో ఆదివారం రాత్రి వీవీపురం, వెంకట్రామపురం పంచాయతీల టీడీపీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా తిరుమలరెడ్డి మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా ఎమ్మెల్యే నాని ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీకి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, త్యాగరాజులు, రాజేష్‌రెడ్డి, సుగుణ, మల్లిరెడ్డి, రాజేష్, పురుషోత్తం, నాగిరెడ్డి, నాగూర్‌రెడ్డి, ప్రతాప్, దిలీప్, రమేష్, సుబ్రహ్మణ్యం, భూపతిరెడ్డి, అశోక్‌రెడ్డి, రామదాసు, ధన, వినోద్, నాగేశ్వరరావు, మార్కండేయ, రాజేంద్ర, పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో ఆరుగురికి గాయాలు

● ఒకరి పరిస్థితి విషమం

వాకాడు, మే 25 (ఆంధ్రజ్యోతి) : తేనెటీగలదాడిలో ఆరుగురు గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన తూపిలిపాళెం సముద్రతీరంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. తిరుపతికి చెందిన 15 మంది కలసి టెంపోలో తూపిలిపాళెం సముద్రం అందాలను చూసేందుకు వచ్చారు. స్నానాలు ఆచరించి మధ్యాహ్నం సమయంలో సవకచెట్ల మధ్యలో వనభోజనాలు చేస్తుండగా అటు వైపుగా వెళ్తున్న మేకలు తేనెటీగల తుట్టెను కదిలించడంతో ఒక్కసారిగా పర్యాటకులపై దాడిచేశాయి. అప్రమత్తమైన పర్యాటకులు చెట్ల మధ్యలో చెల్లాచెదురుగా పరుగులుతీశారు. కొంతమంది చెట్ల కొమ్మలకు తగిలి కిందపడిపోవడంతో తేనెటీగలు దాడిచేశాయి. కార్తీక్ (8), రిషీత్ (12), సుమంత్ (14), సోమశేఖర్ (15), సింధూర (29), ప్రశాంత్ (30) గాయపడ్డారు. ప్రశాంత్ పరిస్థితి విషమంగా ఉంది. వీరిని వాకాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రవినాయుడికి పలువురి శుభాకాంక్షలు

తిరుపతి, మే 25(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం అభిమానుల ఆనందోత్సాహాలు, అధికార, అనధికార ప్రముఖుల శుభాకాంక్షలు నడుమ ఘనంగా జరిగాయి. శాప్ చైర్మన్‌తోపాటు ఆయన సతీమణి బిందు జన్మదినం కూడా ఒకేరోజు కావడం విశేషం. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో జరిగిన వేడుకలకు అధిక సంఖ్యలో టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రముఖులు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ జి.నరసింహ యాదవ్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, ఏపీయూఎఫ్‌డీసీ డైరెక్టర్ ఊకా విజయ్‌కుమార్, మాజీ మంత్రి పరసారత్నం, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు జేబీ శ్రీనివాస్, బీఎల్ సంజయ్, పులుగోరు మురళీకృష్ణారెడ్డి, శ్రీధర్ వర్మ, ఊట్ల సురేంద్ర నాయుడు, కుమారమ్మ, ఎడిపై ప్రణీత్, ఆశాలత, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్ తదితరులు ఉన్నారు. కాగా రవినాయుడు కుటుంబ సమేతంగా కరకంబాడి రోడ్డులోని బొంతాలమ్మ వారిని, తాతయ్యగుంటలోని గంగమ్మను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేయించారు.



రవినాయుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



రవినాయుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ ముఖ్య నేతలు

● పలుచోట్ల సంబరాలు

టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్ ఆధ్వర్యంలో ఎమ్మార్‌పల్లి వైకుంఠపురం ముఖద్వారం వద్ద అన్నదానం చేశారు. తిమ్మినాయుడుపాలెంలోని 1వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వెంకటేష్(ధోనీ), తెలుగు యువత నాయకుడు దిలీప్ రాయల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేయించి, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ నేత జేబీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

మహానాడుకు తరలిరండి: పాశం



ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈ నెల 27, 28, 29వ తేదీలలో జరగనున్న మహానాడు కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పేదప్రజలకు సేవా చేయాలనే ఉద్దేశంతో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. ఆయన ఆశయాలను నేడు సీఎం చంద్రబాబు నెరవేర్చూ పేదలకు అనేక సంక్షేమపథకాలను అమలు చేస్తున్నార న్నారు. టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్‌ను ప్రతిపాదిస్తున్నా మని, మహానాడులో దీనిపై చర్చిస్తామని వివరించారు.

కరాటేలో చెందోడు విద్యార్థినికి అవార్డు



వెంకటలాస్యను అభినందిస్తున్న అధికారులు

కోట, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెందోడు విద్యావికాస్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న వెంకటలాస్య కరాటే పోటీలలో రాష్ట్రస్థాయి అవార్డు సాధించింది. తెనాలి పట్టణంలోని ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం రాష్ట్ర స్థాయి కరాటే పోటీలను విక్టోరియా షాటోకామ్ కరాటే అసోసియేషన్ డూ ఇండియా సంస్థ నిర్వహించింది. ఈ రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో వెంకటలాస్య కటా ఈవెంట్‌లో పాల్గొని రాష్ట్రస్థాయిలో మూడవ స్థానం సాధించింది. మంగళగిరి ఎస్పీ బల్లి రవిచంద్ర చేతుల మీదుగా అవార్డు, ప్రశంస పత్రాలను వెంకటలాస్య అందుకుంది. ఆ చిన్నారికి శిక్షణ ఇచ్చిన మాస్టర్ హరిబాబును పాఠశాల యాజమాన్యం అభినందనలతో ముంచెత్తింది.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



గూడూరు అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను అందజేశారు.

పుత్తూరు వార్తలు

ప్రైవేటు భూమినీ వదల్లేదు

- కబ్జాచేసిన ఆక్రమణదారులు
- పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- పట్టించుకోని రెవెన్యూ, పోలీస్ అధికారులు



ప్రైవేటు భూమిని ఆక్రమించి సాగు

పుత్తూరు అర్బన్, మే 25(ఆంధ్రజ్యోతి): నారాయణవనం మండలంలో ప్రభుత్వ భూములకే కాదు.. ప్రైవేటు భూములకూ రక్షణ లేకుండా పోయింది. నారాయణవనంలో సర్వే నెంబర్ 356/1లో 4.65 ఎకరాల్లో కొంత భూమి ఆక్రమణదారుల చెరలో ఉందని బాధితుడు చలపతిరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి మీద భక్తితో ఆయన 2007లో 4.65 ఎకరాల వ్యవసాయ భూమిని నారాయణవనంలో కొన్నారు. వృత్తి రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆ భూమి విషయంలో 2022 వరకు ఎటువంటి సమస్య తలెత్తలేదు. వైసీపీ హయాంలో.. 2023 డిజిటల్ సర్వేలో భాగంగా భూమి తక్కువగా ఉన్నప్పటికీ ఎక్కువ భాగం రిజిస్టర్ చేసుకున్నారంటూ చలపతిరావుకు రెవెన్యూ అధికారుల నుంచి నోటీసు అందింది. అదనపు భూమిని ఆక్రమించారంటూ అందులో పేర్కొన్నారు. దీంతో కంగుతిన్న ఆయన తన వద్ద ఉన్న రికార్డులతో మండల రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగారు. నేటికీ సమస్యల పరిష్కారానికి నోచుకోలేదు. కాగా, తన 4.65 ఎకరాల్లో కొంత భూమిని ముగ్గురు వ్యక్తులు ఆక్రమించారని ఆయన కోర్టును ఆశ్రయించారు. అందుకు కోర్టు కూడా పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్‌ను జారీ చేసింది. ఈ ఆర్డర్‌తో నారాయణవనం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని చలపతిరావు వాపోయారు. తన భూమికి పూర్తిస్థాయిలో సర్వే చేయించి, ఆక్రమణదారుల నుంచి ఇప్పించాలని రెవెన్యూ అధికారులను కోరినా ఫలితం లేదన్నారు. కలెక్టర్, డీఆర్వో, ఆర్డీవోలను సైతం కలిసి సమస్యను విన్నవించగా ఖాతరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమైనా దృష్టి సారించి తనకు న్యాయం చేయాలని ఆయన వేడుకుంటున్నారు.

చిన్న తగాదాలకు కోర్టుకు రావడం సరికాదు

- న్యాయవాదుల సంఘం నాయకుడు సంజీవి



పుత్తూరు, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రతి చిన్న తగాదాకు కోర్టుకు రాకుండా బయటే పరిష్కరించుకోవాలని న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షుడు సంజీవి సూచించారు. పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ భవనంలో సాధారణ న్యాయఅంశం మీద ఆదివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా విడాకులు, ప్రామిసరీ నోట్లు, భూ తగాదాల మీద ఆయన ప్రసంగించారు. భార్యాభర్తలైన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సర్దుబాటు ధోరణి లేకుండా కోర్టుకు రావడం సరికాదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, గవర్నర్ మాధవులునాయుడు, అధ్యక్షుడు కెఎల్ఎన్‌మూర్తి, మురుగారెడ్డి, రఫీ, మునికృష్ణయ్య, గోపిలు పాల్గొన్నారు.

7 నుంచి ప్రసన్న వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

వడమాలపేట, మే 25(ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంటలోని ప్రసన్నవేంకటేశ్వర స్వామి ఆలయంలో జూన్ 7 నుంచి 15 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈక్రమంలో 3వ తేది కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 6న అంకురార్పణ నిర్వహించనున్నారు. 7న ధ్వజారోహణం చేస్తారు. రాత్రి పెద్దశేష వాహనంపై శ్రీవారు ఊరేగుతారు. 8న చిన్నశేష, హంస వాహనం,9న సింహ,ముత్యపు పందిరి వాహనం,10న కల్పవృక్ష వాహనం,సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి సర్వభూపాల వాహనం,11న మోహినీ అవతారోత్సవం,రాత్రి శ్రీవారి గరుడోత్సవం,12న గురువారం హనుమంత,గజ వాహనం,13న సూర్యప్రభ,చంద్రప్రభ వాహనం,14న రథోత్సవం,రాత్రి ధ్వజావరోహణం నిర్వహించనున్నారు.

మహిళ మెడలో చైన్ చోరీ



చికిత్స పొందుతున్న కల్యాణి

పుత్తూరు అర్బన్, మే 25(ఆంధ్రజ్యోతి): పుత్తూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కల్యాణి అనే మహిళ మెడలోని బంగారు చైన్‌ను ఓ దుండగుడు లాక్కెల్లాడు. వివరాలు ఇలా.. పట్టణానికి చెందిన కల్యాణి విద్యుత్ మోటర్ల దుకాణం నిర్వహిస్తోంది. శనివారం సాయంత్రం దుకాణం మూసివేసి తమ్ముడు శ్రీరామ్‌తో కలిసి తిరుపతికి బయలు దేరింది. ఎంఎస్ఎం పెట్రోల్ బంక్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ప్రయాణిస్తుండగా ఓ వ్యక్తి వెనుక నుంచి వారి వాహనాన్ని వెంబడించి ఆమె మెడలోని 2 సవర్ల బంగారు చైన్‌ను లాక్కెళ్లాడు. ఈ ఘటనలో కిందపడిన మహిళ తలకు గాయాలయ్యాయి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

మహానాడును విజయవంతం చేద్దాం

- కీలక నేతలతో మహానాడు జనసమీకరణపై సమీక్ష
- మహానాడు అంటే తెలుగువారికి పండగ లాంటిది
- మీడియాతో ఎమ్మెల్యే కురుగొండ్ల, నుడా చైర్మన్ కోటంరెడ్డి




మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పక్కన నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి

వెంకటగిరి, మే 25: (ఆంధ్రజ్యోతి): కడపలో నిర్వహించే మహానాడును విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం మహానాడు జనసమీకరణపై పార్టీ నేతలకు వారు దిశానిర్దేశం చేశారు. అనంతరం వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ కడపలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు మహానాడు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకరంగా నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు విధిగా పాల్గొనేలా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. వెంకటగిరి నియోజకవర్గం నుంచి 5 వేల మందికి తగ్గకుండా జనసమీకరణ ఉంటుందన్నారు. మండలానికి వెయ్యిమంది తగ్గకుండా జనసమీకరణ ఉండాలన్నారు. ఆయా మండలాల నేతలు ఈ బాధ్యతలు తీసుకోవాలన్నారు. మహానాడుకు వచ్చే కార్యకర్తలకు, నాయకులకు అవసరమైన రవాణా, వసతి, భద్రత, ఆహారం వంటి అన్ని ఏర్పాట్లను ముందుగానే సమన్వయంతో ఏర్పాటుచేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు జన్ని రమణయ్య, వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, వెంకటగిరి రూరల్, డక్కిలి, రాపూరు మండలాల పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, జోరేపల్లి వెంకటేశ్వర్లు రెడ్డి, దాసరి ప్రభాకర నాయుడు ఉన్నారు.

ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి..ఇక్కడే కలిశాం

- ఎన్‌బీకేఆర్‌లో అలరించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం





సంబరాలు చేసుకుంటున్న పూర్వపు విద్యార్థులు, మాట్లాడుతున్న పూర్వపు విద్యార్థి, ఏసీపీ సంజయ్‌కుమార్

కోట, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి.. ఇక్కడే కలిశాం.. చదువులమ్మ చెట్టు నీడలో అంటూ 38ఏళ్ల తర్వాత పూర్వపు విద్యార్థులు ఒకే వేదికపైకి చేరుకుని ఒకరి యోగక్షేమాలు తెలుసుకుంటూ కొన్ని గంటలపాటు ఉల్లాసంగా గడిపారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సందడి చేశారు. కోట మండలం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ బీఈడీ కళాశాలలో 1986 -87 విద్యాసంవత్సరంలో బీఈడీ చదివిన పూర్వపు విద్యార్థుల సమ్మేళనం ఎన్‌బీకేఆర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగింది. అప్పటి గురువు, ప్రిన్సిపాల్ నేదురుమల్లి రవిశేఖరరెడ్డిని విద్యార్థులు ఆప్యాయంగా పలకరిస్తూ పాదాభివందనం చేస్తూ ఆనాటి మధురస్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. ఇక్కడ పూర్వపు విద్యార్థి తెలంగాణలోని సైఫాబాద్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఆర్ సంజయ్‌కుమార్ బీఈడీ చదివే రోజుల్లోని అనుభవాలను వేదికపై నుంచి పంచుకున్నారు. అప్పట్లో ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థలో నేర్పిన క్రమశిక్షణ, చూపిన మార్గాలు తమ బంగారు భవితకు బాటలు వేశాయని పలువురు పూర్వపు విద్యార్థులు ఉద్వేగంతో మాట్లాడారు. ఎక్కడెక్కడో ఉన్న విద్యార్థులందరూ 38 సంవత్సరాల తర్వాత కలుసుకుని ఉల్లాసంగా గడిపారు.

చిట్టేడులోనూ అపూర్వ సమ్మేళనం..

చిట్టేడులోని నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990 - 91 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వపు విద్యార్థుల ఆధ్వర్యంలో అపూర్వ సమ్మేళనం జరిగింది. అప్పటి గురువులకు పూలమాలలు, మెమొంటోలతో అభినందించారు.





ఐసీఎస్‌రోడ్డులో కురుస్తున్న వర్షం, కోనేటిమిట్టలో కురుస్తున్న వర్షం

గూడూరులో కుండపోత

గూడూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం సాయంత్రం ఒక్క సారిగా కుండపోత వర్షం కురి సింది. ఉదయం నుంచి కొంత ఎండగా ఉన్నా మధ్యహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై సాయంత్రం వర్షం గంటపాటు కురిసింది. తర్వాత ఆగి మళ్లీ విడతలు విడ తలుగా కురిసింది. ఉక్క పోతతో అల్లా డిన ప్రజలు వాతావరణం చల్ల బడడంతో సేదతీరారు. వర్షం కారణంగా ఐసీఎస్‌రోడ్డు, శాంతినగర్ అండర్‌బ్రిడ్జి, కోనేటిమిట్ట తదితర ప్రాంతాలలోని పలు రోడ్లపై వర్షపునీరు ప్రవహించింది. పాదచారులు, వాహనదారులు అవస్థలు పడ్డారు.

ముగిసిన నాగారపమ్మ జాతర

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- గ్రామస్తులు, బంధుమిత్రులతో నిండిపోయిన ఓజిలి



ఊరేగుతున్న అమ్మవారు

ఓజిలి, మే 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామ దేవత నాగారపమ్మ మాత జాతర ఆదివారం ముగిసింది. ఆదివారం తెల్లవారు జామునుంచి సాగిన గ్రామోత్సవం, ఊరేగింపు మధ్యాహ్నం వరకు కొనసాగింది. డప్పులు, మేళతాళాలతోపాటు గంటపెట్టి, వీరతాళ్ల వంటి కార్యక్రమాలు ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారికి ఇంటింటా భక్తిశ్రద్ధలతో హారతి కర్పూరంతోపాటు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ తమ బంధువులు, మిత్రులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు పాటకచ్చేరి అలరించింది. భక్తులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఎస్‌ఐ స్వప్న తమ సిబ్బందితో బందో బస్తును పర్యవేక్షించారు.

కాళంగి బ్రిడ్జిపై నుంచి

నదిలో పడిన గుర్తుతెలియని వ్యక్తి

సూళ్లూరుపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళలమ్మ ఆలయ సమీపంలో ఉన్న కాళంగి వంతెనపై ద్విచక్ర వాహనంలో వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు అదుపు తప్పి కాళంగి నదిలో పడిపోయాడు. సూళ్లూరుపేట నుంచి ఏపీ 39 క్యూఎఫ్ 0892 నెంబరు గల బైక్‌పై వెళుతుండగా సైడు గోడను ఢీకొనడంతో బైక్ పై నుంచి ఎగిరి నదిలో పడిపోయాడు. అటు వైపు వెళ్తున్న వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి కావడంతో వీలుకాలేదు.

దాడి కేసులో యువకుడి అరెస్ట్

చిల్లకూరు: మండలంలోని కోట క్రాస్‌రోడ్డు సమీపంలో కోట మండలం నెల్లూరుపల్లికొత్తపాళెం గ్రామానికి చెందిన గణేష్ కాకువారిపాళెం గ్రామానికి చెందిన శ్రీనివాసులుపై ఆదివారం దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

27 నుంచి యోగా శిక్షణ కార్యక్రమాలు



యోగా శిక్షణను పరిశీలిస్తున్న ఎంపీడీవో

సూళ్లూరుపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేట మండలంలో ఈ నెల 27 నుంచి 31 వరకు యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో ఏవీ మురళికృష్ణ తెలిపారు. మండలంలో మొత్తం 4 క్లస్టర్లగా విభజించి యోగా శిక్షణ ఐదురోజుల పాటు నిర్వహించ నున్నట్లు తలిపారు. ఈ యోగా శిక్షణలో అన్ని గ్రామాల నుంచి అందరూ వచ్చేలా సంబంధిత అధికారులు చొరవతీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్రపై క్లస్టర్ పరిధిలో యోగా శిక్షణ ఇచ్చే మోటీవేటర్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణను ఎంపీడీవో పరిశీలించారు.

వర్షంతో వరి పంటకు జీవం

పెళ్లకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది వేసవిలో ఎండల తీవ్రతతో అధిక ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో ఎడగారులో వరిసాగు చేసిన రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ సమయంలో ఆదివారం కురిసిన ఓ మోస్తారు వర్షం వరి పంటకు జీవం పోసింది. రెండురోజులుగా కురిసిన వానతో వాతావరణం చల్లబడడంతో పాటు కలవకూరు, పెరుమాళ్లపల్లి, జీలపాటూరు, చిల్లకూరు, పెళ్లకూరు, కొత్తూరు, భీమవరం, నెలబల్లి, అక్కగారిపేట, పసుపుకండ్రిగ, పుల్లూరు, చింతపూడి, అర్ధమాల, ఆర్లపాడు తదితర గ్రామాల్లో వరికి జీవం పోసింది.

రోడ్డు ప్రమాదంలో కృష్ణా జిల్లా యువకుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు



మృతి చెందిన అనిల్

సూళ్లూరుపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని శ్రీహరికోటకు వెళ్లే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీసిటి కోల్‌గేట్ పరిశ్రమలో పనిచేసే అనిల్ (22) మృతి చెందాడు. అదే కంపెనీలో పనిచేసే ప్రేమ్‌కుమార్, గణేష్ అనే యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం నాగాలయలంకకు చెందిన మృతుడు అనిల్, గాయపడిన ప్రేమ్‌కుమార్, గణేష్‌లు శ్రీసిటీలోని కోల్‌గేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. వీరు సూళ్లూరులో ఉన్న ఓ హాస్టల్లో ఉంటున్నారు. ఆదివారం సెలవు కావడంతో ముగ్గురు మోటారు సైకిల్‌పై సరదాగా షార్ రోడ్డువైపు వెళ్లి తిరిగి వస్తుండగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి పై ముందుపోతున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టారు. ఆటోను ఢీకొట్టిన వారి వాహనం పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో డ్రైవింగ్ చేస్తున్న అనిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరూ యువకులను 108లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విష మంగా ఉంది. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించే ఏర్పాట్లు చేస్తు న్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతివేగమే ప్రమాదానికి కారణం..

అతివేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. బైక్ వేగంగా దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొని తర్వాత డివైడర్‌రెఢీకొనడంతో బైక్‌లో ఉన్న ముగ్గురిలో గాయపడిన ఇద్దరూ డివైడర్ గోడకు మధ్యలో పడిపోయారు. బైక్ నడుతున్న యువకుడు మాత్రం డివైడర్‌కు బైక్‌కు మధ్యలో ఇరుక్కుపోయి ఘటన స్థలంలోనే మృతి చెందాడు.

రోహిణి కార్తెలో వానలు..!

సూళ్లూరుపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో రోహిణి కార్తె వచ్చిందంటే రోళ్ల పగిలే ఎండలు కాస్తాయని చెబుతుంటారు. ఈ సారి రోహిణి కార్తె రోజే మబ్బులు కమ్ముకుని చల్లగా ఉండడంతో పాటు ఆదివారం సాయంత్రం సూళ్లూరుపేటలో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచే వాతావరణం చల్లగా ఉంది. సరిగ్గా 6 గంటల సమయంలో కారుమబ్బులు కమ్ముకొని చల్లని గాలులు వీస్తూ తేలికపాటి జల్లులు పడడంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. దీనికి తోడు ఈ సారి నైరుతి రుతుపవనాలు ముందుగానే కేరళను తాకడంతో రోహిణి కార్తెలో రోళ్ల పగిలే ఎండలు లేనట్లేనని తెలుస్తోంది.

వాకాటి చంద్రవదనమ్మకు ఘన నివాళులు



తడ, మే 25 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి పినతల్లి వాకాటి చంద్రవదనమ్మకు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. అనారోగ్యంతో కొద్ది రోజుల క్రితం మండల పరిధిలోని చేనిగుంటలోని స్వగృహంలో ఆమె మృతి చెందిన విషయం విదితమే. ఆమేరకు ఆదివారం పలువురు ప్రముఖులు ఆమె నివాసానికి వచ్చి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కావలి ఎమ్మెల్యే కావ్యకృష్ణారెడ్డి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, బీజేపీ, టీడీపీ నాయకులు ఉన్నారు.

అర్ధమాలలో వైభవంగా వేమాలమ్మ జాతర

పెళ్లకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్ధమాల గ్రామంలో ఆదివారం వేమాలమ్మ జాతర వైభంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దఎత్తున పొంగళ్లతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. జాతర సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు పాలచ్చూరు సుబ్బరామయ్యయాదవ్, నరేంద్రయాదవ్ ఆహ్వానం మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, టీడీపీ సీనియర్ నాయకులు, పేరం రమేష్‌నాయుడు, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నాయకులు పాపాడి రాజగోపాల్‌రెడ్డి, మదన్‌మోహన్ నాయుడు, వట్టికుండల శేఖర్ నాయుడు, కృష్ణమనాయుడు, సిద్ధులయ్య నాయుడు, పునబాక పోలయ్య తదితరులు వేమాలమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది, పక్కన బీజేపీ నాయకులు దయాకర్ రెడ్డి, లయన్స్ క్లబ్ చైర్మన్ ఆదిశేషా రెడ్డి తదితరులు

సూళ్లూరుపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట షార్ వారి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఆయుర్వేదిక వైద్యం అందుకున్న వారికి ఉచితంగా మందులను అందజేశారు. ప్రజలకోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులను అందజేసిన తులసి ఆయుర్వేదిక వైద్యశాల నిర్వా హకులు శివప్రసాద్‌ను దయాకర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ఆదిశేషారెడ్డి, అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణ రాజు, అప్పారావు, లలితరావు, బీజేపీ నాయకులు ఆదినారాయణ రెడ్డి, కిరణ్ గౌడ్ ఉన్నారు.

వైభవంగా కుంభాభిషేక వేడుకలు



కుంభాభిషేక జలాలను తీసుకొస్తున్న ఆలయ చైర్మన్ రవీంద్రరెడ్డి, సభ్యులు

సూళ్లూరుపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని శ్రీహరికోట రోడ్డు కేఆర్‌పాళెం వద్దనున్న సాయి సన్నిధి సత్సంగ మందిరంలో 30 వార్షికోత్సవ మహా కుంభాభిషేక వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహిం చారు. ఉదయం గోపూజ నిర్వహించి కుంభాభిషేక వేడుకలను ప్రారంభిం చారు. బాబా మందిరంలో సాయిబాబ విగ్రహానికి, గోపుర పై కలశాలకు కుంభాభిషేక జలాలతో అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించి మహా పూర్ణాహుతి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి తిలకించారు. ఆలయ కమిటీ చైర్మన్ పాదర్తి రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో కుంభాభిషేక వేడుకలు జరిగాయి.

మద్యం దుకాణాల వద్ద నిబంధనలు పాటించాలి



మద్యం సేవించే దుకాణాన్ని మూయిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

సూళ్లూరుపేట, మే 25 (ఆంధ్ర జ్యోతి) మద్యం దుకాణాల వద్ద నిబంధనలు తప్ప కుండా పాటిం చాలని ఎక్సైజ్ సీఐ సురేంద్రబాబు తెలి పారు. ఆది వారం సూళ్లూరుపేటలో మద్యం దుకాణాలను ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేశారు. నిబంధలకు విరుద్ధంగా మద్యం షాపుల పక్కనే ఉన్న మద్యం సేవించే షాపులు, కూల్‌డ్రింగ్స్ దుకాణాలను మూయించారు. సమయ పాలన పాటించాలన్నారు. మద్యం దుకాణాలు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే తెరవాలన్నారు. మద్యం దుకాణాల పక్కనే ఉన్న షాపుల్లో, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదన్నారు.

కోటమ్మకు విశేష పూజలు



కోట, మే 25 (ఆంధ్రజ్యోతి) : కోట గ్రామదేవత కోటమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఈ సంద ర్భంగా అమ్మవారికి పండితులు పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయా మండలాల నుంచి వచ్చిన భక్తులకు

తేనెటీగల దాడిలో ఆరుగురికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం



వాకాడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతి వాసులు

వాకాడు, మే 25 (ఆంధ్రజ్యోతి) : తేనెటీగలదాడిలో ఆరుగురు గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన తూపిలిపాళెం సముద్రతీరంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. తిరుపతికి చెందిన 15 మంది కలసి టెంపోలో తూపిలిపాళెం సముద్రం అందాలను చూసేందుకు వచ్చారు. స్నానాలు ఆచరించి మధ్యాహ్నం సమయంలో సవకచెట్ల మధ్యలో వనభోజనాలు చేస్తుండగా అటు వైపుగా వెళ్తున్న మేకలు తేనెటీగల తుట్టెను కదిలించడంతో ఒక్కసారిగా పర్యాటకులపై దాడిచేశాయి. అప్రమత్తమైన పర్యాటకులు చెట్ల మధ్యలో చెల్లాచెదరుగా పరుగులుతీశారు. కొంతమంది చెట్ల కొమ్మలకు తగిలి కిందపడిపోవడంతో తేనెటీగలు దాడిచేశాయి. కార్తీక్ (8), రిషీత్ (12), సుమంత్ (14), సోమశేఖర్ (15), సింధూర (29), ప్రశాంత్ (30) గాయపడ్డారు. ప్రశాంత్ పరిస్థితి విషమంగా ఉంది. వీరిని వాకాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత


లబ్దిదారులకు చెక్కులు అందజేస్తున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, మే 25(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఓ వరమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్వగృహంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.4.31లక్షలకు సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

'ప్రధానమంత్రి మన్‌కి బాత్'ను వీక్షించిన నాయకులు

శ్రీకాళహస్తి, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మన్‌కి బాత్‌ను ఆదివారం బీజేపీ నాయకులు వీక్షించారు. వారు మాట్లాడుతూ జూన్ 21న యోగా దినోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. పలు అంశాలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అమర్‌నాథ్, కొండేటి గోపాల్, డిల్లీకుమార్,మోహన్‌రావు, గోపాల్, చెంచురెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ కిట్ల అందజేత



శ్రీకాళహస్తి, మే 25(ఆంధ్రజ్యోతి): జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత ఆదేశాలతో ఆ పార్టీ నాయకులు బృందమ్మ కాలనీ, బోరుమానుకండ్రిగ ప్రాంతాల్లో పార్టీ సభ్యత్వ కిట్లను అందజేశారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో జనసేన పటిష్టతకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్రశేఖర్, పేట చిరంజీవి, దినేష్, వెంకటరమణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: జనసేన సభత్వాలు వారి కుటుంబాలకు పార్టీ భరోసా ఇస్తుందని ఆ పార్టీ ఉపాధ్యక్షుడు మోహన్ చెప్పాడు. ఆదివారం మండలంలోని అంజూరు,సూరమాల, కాళంగి, గుంటిపేడు గ్రామాల్లో ఈ సభ్యత్వ నమోదు కిట్లను పంపిణీ చేశారు. అలాగే పెరిందేశంలో జనసేన అధ్యక్షుడు థామస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మునిశేఖర్, కిషోర్, లోకేష్, ఖర్జూరరావు, కుమార్, వాసు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ : కాటూరు లో ఆదివారం తమ పార్టీ కార్యకర్తలకు నియోజక వర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ కొప్పల లావణ్యకుమార్ సభ్యత్వ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భాషా, ఉపాధ్యాక్ష్యుడు కృష్ణ, కార్యదర్శి గురువయ్య, మురళి, లతీష్, వేలు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి నేతల పరామర్శ

శ్రీకాళహస్తి, మే 25(ఆంధ్రజ్యోతి): అమ్మపాళెంలో శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ ట్రస్టు బోర్డు మెంబర్, మాజీ సర్పంచ్ కందాటి రాఘవరెడ్డి మృతికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులులు సంతాపం ప్రకటించారు. ఆదివారం వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. యుగంధర్‌రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, రఘుకేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం


విద్యార్థులతో కరుణీక సంఘ నాయకులు

శ్రీకాళహస్తి, మే 25(ఆంధ్రజ్యోతి): కొత్తపేటలో విజయలక్ష్మి డిగ్రీ కళాశాలలో ఆదివారం కరుణీక సంఘం ఆధ్వర్యంలో ఈఏడాది పదవ తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులకు జ్ఞాపిక, నగదు పురస్కారం అందజేశారు. ముఖ్యఅతిథులుగా మునిసురేష్ పిళ్లై, విశ్వనాథ్ పిళ్లై హాజరై అభినందించారు. కార్యక్రమంలో సభ్యులు ప్రకాష్, ఉమాశంకర్, దామోదరం, రజనీకాంత్, శ్యామ్, రాజ్‌చరణ్, వసంత్‌కుమార్, రమేష్ తదితరలుఉ హాజరయ్యారు.

మహానాడుకు భారీగా తరలిరావాలి


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, మే 25(ఆంధ్రజ్యోతి): తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీక మహానాడు అని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప సమీపంలో జరిగే మహానాడు కార్యక్రమానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నాయకత్వంలో కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మిన్నల రవి, మునిరాజాయాదవ్, కోట చంద్రశేఖర్, చింతగింజల సునీల్, భాస్కర్, రామచంద్రయ్య, కృష్ణమూర్తి,వంశీ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్యే సుధీర్ నివాళులు



శ్రీకాళహస్తి, మే 25(ఆంధ్రజ్యోతి): అమ్మపాళెం మాజీ సర్పంచ్ వెంకటరాఘవరెడ్డికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి నివాళి అర్పించారు. అనారోగ్యంతో ఆదివారం వెంకటరాఘవరెడ్డి చనిపోయారు. ఆయన ఇంటికి వెళ్లి మృతదేహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

జంట మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

శ్రీకాళహస్తి, మే 25(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రాం బంధంతో విషాదాంతమైన జంట మృతదేహాలకు పోలీసులు పోస్టుమార్టం పూర్తిచేశారు. విశాఖకు చెందిన పద్మ శ్రీకాళహస్తికి చెందిన సురేష్‌లు ఉ మృతి చెందిన విషయం తెలిసిందే. రెండవ పట్టణ పోలీసులు ఆదివారం రెండు మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేశారు. పద్మ మృతదేహాన్ని ఆమె కుమారుడికి అప్పగించారు. సురేష్ మృతదేహాన్ని అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ముక్కంటి సేవలో సినీ గాయని స్మిత



శ్రీకాళహస్తి, మే 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఆదివారం సినీ గాయకురాలు స్మిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలుచేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

భూతగదా : ఇద్దరిపై కేసు నమోదు

రేణిగుంట, మే 25, (ఆంధ్రజ్యోతి) : భూ వివాదంలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు గాజులమండ్యం పోలీసులు తెలిపారు. ఆదివారం చెంగరెడ్డి పట్టెడలో ఇరువర్గాల మధ్య కోర్టులో భూమిపై వివాదం నడుస్తున్న క్రమంలో కాంతారెడ్డి అనే వ్యక్తిపై శంకరయ్య, మురళిలు దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

టీడీపీ కార్యకర్త మృతికి ఆదిమూలం నివాళి



నారాయణవనం, మే 25(ఆంధ్రజ్యోతి): కళింమిట్ట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఎన్. గిరిబాబు(49) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మెల్యే ఆదిమూలం సమాచారం తెలుసుకుని ఆదివారం మధ్యాహ్నం వెళ్లి రిబాబు మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. గిరిబాబు దహన క్రియలకు ఆర్థిక సాయం అందించారు.

ఆటో డ్రైవర్లకు పోలీసుల కౌన్సెలింగ్



శ్రీకాళహస్తి, మే 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద ఆదివారం 1వ పట్టణ సీఐ గోపి ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆటో డ్రయివర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని ఆయన సూచించారు. పేరు, చిరునామాను పోలీసులకు తెలియపరచాలన్నారు. భక్తుల పట్ల అమర్యాదగా ప్రవర్తించకూడదన్నారు. రైల్వే ప్లాట్‌ఫాం వద్ద ప్యాసింజర్లను బలవంతంగా ఆటోలో ఎక్కించి కమీషన్ల కోసం లాడ్జీల వద్దకు తీసుకెళితే చర్యలు తీసుకుంటామన్నారు.

బాణసంచా దుకాణాల తనిఖీ

శ్రీకాళహస్తి, మే 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్ రోడ్డులోని బాణసంచా దుకాణాలను డీఎస్పీ నరసింహమూర్తి రెండవ పట్టణసీఐ నాగార్జునరెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం దుకాణలను నిర్వహించాలన్నారు. ప్రమాదాలు జరగకుండా ఎప్పటికపుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రద్ధ పెడితే లాభాల బాటకు ఆర్టీసీ డిపో

● నేడు సత్యవేడుకు ఆర్టీసీ ఎండీ తిరుమలరావు


సత్యవేడులోని ఆర్టీసీ డిపో

సత్యవేడు, మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దుకు కూతవేటు దూరంలో, జిల్లా కేంద్రానికి మారుమూల ఉన్న ఆర్టీసీ డిపోలో సమస్యలు తిష్టవేశాయి. 1980లో శాటిలైట్ డిపోగా ప్రారంభమైన ఈ డిపో తర్వాత పూర్తిస్థాయి డిపోగా రూపాంతరం చెందింది. అప్పట్లో రాష్ట్రంలోనే అత్యధిక కలెక్షన్‌లు సాధించే డిపోగా పేరు పొందింది. గత దశాబ్దంగా అధికారుల అనాలోచిత నిర్ణయాలు, నిర్లక్ష్య ధోరణి ఫలితంగా డిపో నష్టాల బాట పడుతోంది. 66 సర్వీసులతో వివిధ రూట్లలో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించి ప్రస్తుతం ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. సర్వీసులు చాలా వరకు తగ్గించడంతో బస్సుల సంఖ్య 45కి చేరింది. సత్యవేడు - తిరుమల ఎక్స్‌ప్రెస్ సర్వీసులను లింక్ సర్వీసులుగా మార్చడంతో సత్యవేడు నుండి తిరుపతికి వెళ్లాలంటే ఎక్స్‌ప్రెస్ సర్వీసులు సకాలంలో దొరక్క ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. నాగలాపురం - సూళ్ళూరుపేట సర్వీసును రూట్ మార్చడంతో తడకు వెళ్లాల్సిన విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పల్లెలు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో పల్లెవెలుగు సర్వీసుల సేవ మృగ్యంగా మారింది. సత్యవేడు నుంచి అమరావతికి రెండు సర్వీసులు ఏర్పాటు చేయాలని ఎప్పటినుంచో కోరుతున్నా పట్టించుకోవడంలేదు. నెల్లూరు, బెంగళూరుకు అదనపు సర్వీసుల ప్రతిపాదన, రద్దయిన మదనపల్లె, వేలూరు సర్వీసుల పునరుద్ధరణ డిమాండ్లు బుట్టదాఖలయ్యాయి. ప్రధానంగా సత్యవేడు నుంచి రాత్రి 8 గంటలకు తిరుపతి, శ్రీకాళహస్తి, టీపీకోట రూట్లలో సర్వీసులు నడపాలని ప్రజలు కోరుతున్నారు. సరైన ప్రణాళికలు, సముచిత నిర్ణయాలు అమలు చేస్తే డిపో లాభాల బాటలో నడిచే అవకాశం లేక పోలేదు. సోమవారం ఇక్కడకు రానున్న ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు డిపోలో సమస్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేసి పూర్వ వైభవం తీసుకురావాలని పజలు కోరుతున్నారు.

ఆలయ సమీపాన ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలు తొలగిస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి, మే 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ పరిసరాల్లో ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆలయ డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి హెచ్చరించారు. నాలుగవ గేటు సమీపంలో సన్నిధి వీధి రోడ్డుకు ఆనుకుని ఉన్న కాలువ స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించి నిర్మాణం చేపట్టారు. ముక్కంటి ఆలయం అన్నదానం, ప్రసాదాలపోటు నుంచి వెలువడే నీరు ఈ కాలువ ద్వారా గొడ్డేరుకు చేరుతుంది. ఈవో బాపిరెడ్డికి ఆదేశాల మేరకు ఆదివారం డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, అధికారులు, సిబ్బందితో కలిసి ఆక్రమణలను తొలగించారు. సూపరింటెండెంట్ నాగభూషణం, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవత కొలుపు

శ్రీకాళహస్తి, మే 25(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం సాంబయ్యపాళెంలో ఆదివారం గ్రామదేవత కొలుపు వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఆయనకు స్థానికులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శాప్ చైర్మన్‌కు సత్కారం


రవినాయుడిని సన్మానిస్తున్న కృష్ణయాదవ్

శ్రీకాళహస్తి, మే 25(ఆంధ్రజ్యోతి): శాప్ చైర్మన్ రవినాయుడిని ఆయన స్వగృహంలో ఆదివారం టీడీపీ మండలాధ్యక్షుడు అక్కింతల కృష్ణయాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముక్కంటి ప్రసాదాలను అందజేశారు.

వైభవంగా రౌద్రూళి అంకాళమ్మ జాతర


పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

నారాయణవనం, మే 25(ఆంధ్రజ్యోతి): పాలమంగళం ఉత్తరంలో రౌద్రూళి అంకాళమ్మ జాతర ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం భక్తి శ్రద్ధలతో గెరిగెను ఊరేగించారు. అమ్మవారి సోదరి ఏటి గంగమ్మకు మహిళలు పొంగళ్లుపెట్టి, అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం గణపతి పూజతో జాతర ప్రారంభమైంది. 5 రోజుల పాటు జాతర జరుగుతుందని నిర్వాహకులు చెప్పారు. సోమవారం అగ్నిగుండ ప్రవేశం జరుగుతుందని తెలిపారు.

పరశురామేశ్వరుని సేవలో ఆర్కియాలజీ అధికారి

ఏర్పేడు, మే 25(ఆంధ్రజ్యోతి): గుడిమల్లంలో పరశురామేశ్వరస్వామిని హైదరాబాద్ సర్కిల్ ఆర్కియాలజీ సూపరింటెండెంట్ నిహిల్ దాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన


స్థానికులతో మాట్లాడుతున్న నర్సనాయుడు, అంజు ప్రసన్న

రేణిగుంట, మే 25, (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాల సమీపంలో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ నర్సానాయుడు హెచ్చరించారు. ఆదివారం దొడ్లమెట్ట, ఇంద్రా నగర్ కాలనీలో మత్తు పదార్థాల వ్యసనాల వల్ల జరిగే అనర్థాలపై యువతకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణం వద్ద బహిరంగంగా మద్యం తాగినా, తినుబండారాలు విక్రయించినా కేసు నమోదు చేస్తామన్నారు. బహిరంగంగా తాగినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీజేపీ నూతన కమిటీ ఎన్నిక

సత్యవేడు, మే 25 (ఆంధ్రజ్యోతి):మండల బీజేపీ నూతన కమిటీని ఆపార్టీ మండల అధ్యక్షుడు బాలాజీ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మునిక్రిష్ణయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఎన్నిక జరిగింది, ఉపాధ్యక్షులుగా ఎం.పద్మప్రియ, బీ.శ్రీదేవి, కోటి, వినోద్, శేఖర్ రెడ్డి, ఆసయ్, ప్రధాన కార్యదర్శులుగా శ్రీకాంత్, నరేంద్ర, కార్యదర్శులుగా రాజా, రవి, గిరిధర్, సుందరం, పద్మ తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు మోహన్ బాబు, శేఖర్‌నాయుడు, దినకరన్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వాహన చోదకులకు జరిమానా



బుచ్చినాయుడుకండ్రిగ, మే 25 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి - తడ రోడ్డు పదవ మైలు పారెస్టు చెక్ పోస్టు దగ్గర పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు లేని పలు వాహనాలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విశ్వనాథనాయుడు మాట్లాడుతూ వాహనచోదకుడు తప్పకుండా రికార్డులు కలిగి ఉండాలన్నారు. మొదట విడత జరిమానాతో సరిపెట్టామన్నారు. రెండవసారి పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. తాగి వాహనాలు నడిపితే డ్రంకెన్ డ్రైవ్ కింద కేసు నమోదు చేసి కోర్టుకు పంపుతామన్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌కు సన్మానం

శ్రీకాళహస్తి, మే 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని ఆదివారం ఊరందూరులో తొట్టంబేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందిన భారతి కలిసి సత్కరించారు. ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. రఘునాయుడు, గిరిప్రసాద్, కందాటి విశ్వేశ్వర్‌రెడ్డి ఉపాల్గొన్నారు.

ఘనంగా శాకాహార ర్యాలీ

శ్రీకాళహస్తి, మే 25(ఆంధ్రజ్యోతి): విశ్వామిత్ర లైట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జ్ఞానప్రసూనాంబ పిరమిడ్ ధ్యానసేవ ట్రస్టు సహకారంతో ఆదివారం బహదూరుపేటలో శాకాహార ర్యాలీ ఘనంగా నిర్వహించారు. శాకాహారంతోనే ఆరోగ్యమంటూ కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవవగాహన కల్పించారు. పలువురు ధ్యానులు పాల్గొన్నారు.

నాగరాజునాయుడికి సత్కారం


నాగరాజునాయుడిని సన్మానిస్తున్న గ్రామస్థులు

ఏర్పేడు, మే 25(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షులుగా ఎన్నికైన నాగరాజునాయుడును ఏర్పేడు మండలంలోని పాతవీరాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఏర్పేడు మండలంలోని ప్రజాసమస్యలపై దృష్టిపెట్టి మండలాభివృద్ధికి కృషి చేయానలి ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో కొత్త రేషన్ కార్డుల ఒత్తిడి

రేణిగుంట, మే 25, (ఆంధ్రజ్యోతి) : సచివాలయాల్లో కొత్త రేషన్ కార్డు దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణకు అవకాశం కల్పించింది. దీంతో దరఖాస్తుదారులు క్యూ కడుతున్నారు. కొన్ని సచివాలయాల్లో సెక్రటరీలు ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు. వెల్ఫేర్ ఇన్స్పెక్టర్లపై ఒత్తి డడి పెరిగింది. సర్వర్లు తరచూ మొరాయించడంతో దరఖాస్తులు పెరిగిపోతున్నాయి. దీనిపై ఇంచార్జి ఎంపీడీవో ప్రభురావును వివరణ కోరగా సిబ్బంది కొరత, సర్వర్ల సమస్య గుర్తించామన్నారు. సచివాలయంలోని ఇతర సిబ్బందిని ఈ దరఖాస్తుల ప్రక్రియకు వినియోగించుకోవాలని పంచాయితీ సెక్రటరీలకు సూచిస్తామన్నారు.

గిడ్డంగి నిర్మాణంతో రేషన్ సరుకులకు భద్రత

● రూ.60 లక్షలతో భవన నిర్మాణం ● మూడు మండలాలకు ఇదే స్టాక్ పాయింట్


పిచ్చాటూరులో ఇటీవల ప్రారంభమైన పౌర సరఫరాల గోడౌన్

పిచ్చాటూరు, మే 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పౌర సరఫరాల సంస గిడ్డంగి ఏర్పాటుతో రేషన్‌సరుకుల సరఫరాకు ఇబ్బందులు తప్పాయి. సుమారు రూ.60 లక్షల వ్యయంతో కొత్త భవనాన్ని నిర్మించారు. ఇక్కడ స్టాక్ పాయింట్ ద్వారా పిచ్చాటూరు, నాగలాపురం, కేవీబీ పురం మండలాలకు నిత్యావసర సరకులను రవాణా చేస్తుంటారు. ఇంత పెద్ద స్టాక్ పాయింట్ అయినప్పటికీ 40 ఏళ్లుగా సొంత భవనం లేదు. ఎంపీపీ పాఠశాలను ఆనుకుని ఉన్న పాడుబడ్డ పీఏసీఎస్ భవనాన్నే గిడ్డంగిగా వినియోగించారు. ఈ భవనం పైకప్పు పెచ్చులు ఊడి ఉరుస్తుండడం వల్ల నిత్యావసర సరకులు తడిసి ముద్దయ్యేవి. అప్పుడప్పుడు గిడ్డంగిలో దొంగతనాలు కూడా జరిగిన సందర్భాలున్నాయి. ఈ నేపథ్యంలో మూడేళ్ళ క్రితం ఎమ్మెల్యే ఆదిమూలం దీనిపై దృష్టి సారించారు. అప్పటి జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫలితంగా వెయ్యి టన్నుల గిడ్డంగి నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరయ్యాయి. రెండేళ్ల క్రితం భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేయించారు. వెంటపడి పనులు పూర్తి చేయించడంలో సఫలీకృతమయ్యారు. భవనాన్ని ఇటీవల శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌తో కలిసి ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించారు.

గోడౌన్ నిర్మించడం సంతోషంగా ఉంది



వెయ్యి టన్నుల కెపాసిటీ గల పౌర సరఫరాల గోడౌన్ నిర్మించడం సంతోషంగా ఉంది. ఈ గోడౌన్ నుంచి పిచ్చాటూరుతో పాటు నాగలాపురం, కేవీబీ పురం మండలాల్లోని రేషన్ షాపులకు నిత్యావసర వస్తువులను ఇకపై భద్రంగా సరఫరా చేసేందుకు వీలుంటుంది.

-కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్యే